ప్రజాశక్తి

శనివారం 12 నవంబర్ 2022 8 పేజీలు





గుంటూరు పల్నాడు

మైనార్టీలకు అండగా ఉంటాం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి
- గుంటూరుకు వరాలు ప్రకటించిన సిఎం
- భూగర్భ డ్రెయినేజీ పథకానికి రూ.287 కోట్లు
- శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణకు రూ.131 కోట్లు
- మైనార్టీలకు కౌన్సెలింగ్ కేంద్రం, లైబ్రరీ ఏర్పాటు



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో అభివృద్ధి పథకాలను వెంటనే ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారతరత్న, మౌలానా అబుల్ కాలమ్ ఆజాద్ 135వ జయంతి వేడుకల సందర్భంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం నిర్వహించిన సభలో సిఎం పాల్గొన్నారు. మౌలానా అబుల్ కాలమ్ ఆజాద్, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి అధ్యక్షత వహించారు. సిఎం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రెయినేజి పథకానికి రూ.287 కోట్లు మంజూరు చేస్తున్నట్టు, శంకర్‌విలాస్ వద్ద బ్రిడ్జి

▶ 2లో



ఐటిసి ఉత్పత్తుల స్టాల్‌ను తిలకిస్తున్న సిఎం

26 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు

- రూ.3,450 కోట్ల వ్యయంతో నిర్మాణం
- పరిశ్రమదారులకు ఎల్లవేళలా సహకారం : సిఎం జగన్
- పల్నాడులో ఐటిసి గ్లోబర్ స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

వార్త మెయిన్‌లో

వార్తలు లోపలి పేజీల్లో



పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిపిఎం శ్రేణులు

మోడీ విశాఖ పర్యటనపై నిరసన వెల్లువ

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, దిష్టిబొమ్మల దహనం



గుంటూరు నగరంలో నిరసన తెలుపుతున్న వామపక్షాలు, కార్మిక సంఘాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

సిపిఎస్ రద్దు చేయాలి

ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతి

వార్త మెయిన్‌లో

క్రికెట్‌ను ప్రారంభిస్తున్న సిసిఎల్‌ఎ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్



పని ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలు దోహదం

- గెలుపోటములతో సంబంధం లేకుండా రాణించాలి
- ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభ సభలో వక్తలు

వార్త మెయిన్‌లో



షాట్‌పుట్, క్యారెమ్స్‌లో..



టెన్నికాయిట్ ఆడుతున్న తెనాలి సబ్ కలెక్టర్



గుంటూరు, బాపట్ల, పల్నాడు రెవెన్యూ క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్





మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళు లర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

విద్యారంగానికి అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

దేశంలో విద్యా రంగానికి భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చేసిన కృషి ఎనలేనిదని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలామ్ ఆజాద్ జయంది సదర్భంగా కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాలులో శుక్రవారం జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. తొలుత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగంలో అబుల్ కలామ్ ఆజాద్ తెచ్చిన మార్పులు, అభివృద్ధిని కొనియాడారు. విద్యతోపాటు ప్రతి ఒక్కరికీ అదనపు విజ్ఞానం ఉండాలనే ఆకాంక్షతో

▶ 2లో

రాజధాని మాస్టర్‌ప్లాన్‌పై నేడు గ్రామసభలు

5లో



అందరూ కలసికట్టుగా జీవించాలి

ప్రజాశక్తి - వినుకొండ

మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఏ.తౌషిద్ హుస్సేన్ ఆదేశాలతో పాన్ ఇండియా అవేర్నెస్ క్యాంపెయిన్ లో భాగంగా బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆరె. సామ్రాజ్యం న్యాయవాదులతో కలిసి వినుకొండ మండలంలోని అందుగుల కొత్తపాలెం , కొప్పుకొండ, నడిగడ్డ, దొండపాడు, తిమ్మాయపాలెం, ఉప్పరపాలెంలలోని సచివాలయములలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహిం చిన బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు అరే సామ్రాజ్యం మాట్లాడుతూ పొలం గట్టు తగాదాలు, ప్రామిసరి నోట్ , భార్యాభర్తల తగాదాలు,ఆస్తి పంపకాల గురించి,పంట నష్ట పరిహారం ఎలా పొందాలో వివరించారు. గ్రామంలో అందరూ కలసి కట్టుగా జీవించాలని గొడవల జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు. పలువురు న్యాయ వాదులు మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలో వివరించారు.



మాజీ ఎమ్మెల్యే రావి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు నియోజకవర్గ మాజీ సమన్వయకర్త మాజీ అధ్యక్షులు పత్తిపాడు మాజీ ఎమ్మెల్యే రావి వెంకట రమణ జన్మదిన వేడుకలను శుక్రవారం పొన్నూరు ఐలాండ్ సెంటర్ లో వైసిపి నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వ హించారు నిర్వహిచారు. కార్యక్రమంలో షేక్. నాజర్, జాఫర్, మొల్ల కరీం, షాఫైతుల్లా, గేరా సుబ్బయ్య, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పఠనమే కీలకం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

విద్యార్థులు గైడ్స్ జోలికి పోకుండా పాఠ్యపుస్తకాల పఠనమే అత్యంత కీలకమని దీనివల్ల పరీక్షలు తేలిగ్గా వ్రాయవచ్చు అని హైదరాబాద్ డాక్టర్ కె ఎస్ రావు ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు శుక్రవారం సాయంత్రం స్థానిక అశోక పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సెమినార్‌లో వారు పాల్గొని విద్యార్థులకు అనేక విషయాలు తెలిపారు. సమయం వృధా చేయకుండా విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. 9,10 తరగతుల్లోనే గట్టి పునాది వేసుకొని లక్ష్యాన్ని సాధించాలన్నారు విద్యార్థులు తల్లి దండ్రులు కూడా తమ పిల్లలకు సెల్ ఫోన్లు అందుబాటులో ఉంచకుండా నెలనెలా పాఠశాలకు వెళ్లి తమ పిల్లల విద్య పట్ల విద్య బోధన పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల యజమాన్యం, శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. పాఠశాల విద్యార్థిని సముద్రాల పూజ గాయత్రి భరతనాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, విద్యారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎఎన్ యులో గులాబీ ప్యానల్ అభ్యర్థుల గెలుపు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోధనేతర సిబ్బంది అసోసియేషన్ (వికాస)కు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో గులాబీ ప్యానల్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ఆచార్య ఎస్. మురళీమోహన్ వివరాలు వెల్లడించారు. మొత్తం ఓట్లు 251 ఉండగా వాటిల్లో 248 మాత్రమే పోలయ్యాయి. అధ్యక్ష పోటీలో అనిల్ కుమార్ కు 138 ఓట్లు, యోబుకు 106 ఓట్లు రాగా 36 ఓట్ల తేడాతో విజయం సాధించారు. గులాబి ప్యానల్ నుంచి ఉపాధ్యక్షునిగా నీలవు ప్రసాద్ - 164, ప్రధాన కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు -159, సంయుక్త కార్యదర్శులుగా బి. నరసారెడ్డి 146, రెడ్డి ప్రకాశరావు-141, కోశాధికారిగా పి.ఆనంద్ కుమార్-123 ఓట్లతో గెలిచారు. కార్యవర్గ సభ్యులుగా గులాబీ ప్యానల్ నుంచి ఎ. గోపాలకష్ణ, బషీర్ అహ్మద్, ఆర్. చిట్టిబాబు, జి.శ్రీను, టి.జయప్రసాద్ (రెండాకుల ప్యానల్), ఎం. వెంకట రమణ, భాస్కరరెడ్డి, వి. రవిబాబు, టి. వెంకటేశ్వరరావులు గెలిచారు. ఒక్క కార్యవర్గ సభ్యుని పోస్టు మినహా మిగిలిన అన్ని హోదాలలో గులాబి ప్యానల్ జయకేతనం ఎగురవేసింది.

ఈ సందర్భంగా గెలుపొందిన అభ్యర్థులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన



ప్రతీ ఒక్కరికి కతజ్ఞతలు తెలిపారు. అలాగే తమతోపాటు ప్యానల్ నుంచి పోటీలో నిలిచి గెలిచిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గులాబి ప్యానల్ అభ్యర్థులు వీసి ఆచార్య పి. రాజశేఖర్, రెక్టార్ ఆచార్య వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బండి కరుణలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో అధికారులు గెలిచిన ప్యానల్ కు శుభాకాంక్షలు తెలియజశారు.

కుష్టు బాధితుల గుర్తింపునకు ప్రత్యేక కార్యక్రమం

పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.శోభారాణి

ప్రజాశక్తి - నరసరావుపేట

శరీరంలోని అనేక మార్పుల వల్ల కుష్టు వ్యాధి వస్తుందని, వారి పట్ల వివక్ష తగదని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుష్టు వ్యాధి నివారణ కోసం ఈనెల 15వ తేదీ నుండి 5వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా కుష్టువ్యాధి గుర్తింపు, నిర్ధారణ-నివారణ, చికిత్స కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మైకో బాక్టీరియమ్ లెప్రే అనే బ్యాక్టీరియా వలన కుష్టు వస్తుందని, పాపాల వల్లో, వంశపారంపర్యంగానే కాదని, వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని పల్నాడు జిల్లా కుష్టు, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ కె.పద్మావతి తెలిపారు. చర్మం మీద స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, చెవులు వీపు, ఎద మీద నొప్పి లేని బుడిపెలు, కనురెప్పలు మూతపడకపోటం, అరికాళ్లు, అరి చేతులలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువుల్ని గుర్తించలేక పోవడం, చేతి నుండి వస్తువులు జారిపోవడం, కాళ్ళ నుండి చెప్పులు జారి పోవడం, తెలియకుండా కాళ్ళ లో చేతులలో బొబ్బలు రావడం, చేతి వేళ్లలో, కాలి వేళ్లలో వైకల్యం రావడం ఈ వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ లక్షణాలున్న వారు ఆశా కార్యకర్తలు, వాలంటీర్లకు తెలపాలని సూచించారు.

జలగలా ప్రజల రక్తం పీలుస్తున్నారు

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని నడి గడ్డలో శుక్రవారం బాదుడే -బాదుడు కార్య క్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడుపై జలగలా ప్రజల రక్తం పీలుస్తున్నారని ఆరోపించారు.

మైనార్టీలకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

విస్తరణకు రూ.131 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభం అవుతాయన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ముస్లిమ్ కౌన్సిలింగ్ కేంద్రం, లైబ్రరీ సెంటర్ మంజూరు చేస్తున్నామన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 4 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్లే మైనార్టీలు ఎంతో అభ్యున్నతి సాధించారని చెప్పారు. రాష్ట్రంలో 2019 నుంచి గొప్ప మార్పులొస్తున్నాయని, పదవులల్లో మైనార్టీలకు ప్రాధాన్యం ఇచ్చామని, 2019 జూన్ నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు వివిధ పథకాల కింద 44,13,773 మైనార్టీల ఖాతాల్లోకి రూ.10,309 కోట్లు జమ చేశామని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల సంక్షరణ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా మాట్లాడుతూ ఉర్దు భాషను రెండో అధికార భాషగా చట్టబద్ధత కల్పించిన ప్రభుత్వం ఇదన్నారు. ముస్లిమ్ మైనార్టీల సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించామని, జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం, వైఎస్సార్ షాదీతోఫా అమలుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ షాదీతోఫా పథకానికి ఇప్పటి వరకు 162 మంది ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా గుంటూరులో 63 వేల ఇళ్ల పట్టాలు అందించడం చరిత్రలోనే ఎవరు చేయని కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మేరుగ నాగార్జున, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మైనారిటీల సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సెక్రటరీ ఎఎమ్‌డి ఇంతియాజ్, డైరెక్టర్ జి.సి.కిషోర్ కుమార్, ఏ.పి.రాష్ట్ర మైనారిటీ కమిషనర్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమద్ ఖాన్, గుంటూరు మేయర్ కావటి శివనాగమనోహర నాయుడు, కమిషనరు కీర్తీ చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, జెడ్‌పి చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, కల్పలతా రెడ్డి, కెఎస్‌లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, మద్దాళి గిరిధర్, అన్నాబత్తుని శివకుమార్, ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర ఉర్దు అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్, రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు మహమ్మద్ ఆలీ, మైనారిటీల సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ జియావుద్దీన్, డిఎస్. హబీబుల్లా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, చైర్‌పర్సన్లు ఎం.శేషగిరిరావు, డి.రేవతి, సిహెచ్ నాగేశ్వరరావు, ఎం.పురుషోత్తం, కె.భవానీ, ముంతాజ్ పఠాన్, మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, డిసిఎంఎస్ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మీ, గుంటూరు డిప్యూటీ మేయర్లు వి.బాలవజ్రబాబు, సజీలా, మాజీ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్, ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి మహమ్మద్ ఘని పాల్గొన్నారు.

విద్యారంగానికి అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి

(మొదటి పేజీ తరువాయి)

లలితకళ అకాడమీ, సాహిత్య అకాడమీ, నాటక అకాడమీ వంటి వాటిని స్థాపించారని చెప్పారు. మైనారిటీలు అంటే ముస్లిములు మాత్రమే కాదని, క్రైస్తవులు, కాందిసీకులు, ఇతర వెనకబడ్డ తరగతులని, వీరి అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అంటే ఆజాద్ అనేది తన కలం పేరుని ఆ పేరుతో రెండు వారపత్రికలను నడిపి స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. ఎక్కడో మక్కాలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి స్వాతంత్ర్యోద్యమ సమయంలో మహాత్మా గాంధీ, నెహ్రూలతో కలిసి పోరాడారాన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, వివిధ శాఖల అధికారులు, మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.

దేశ పురోగతి విద్యా విధానంపై ఆధారపడి ఉంటుంది



మాట్లాడుతున్న ఎఎన్‌యు మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ తులసీదాస్

ప్రజాశక్తి - నరసరావుపేట

దేశ పురోగతి విద్యా విధానంపై ఆధారపడి ఉంటుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ డి.తులసీదాస్ అన్నారు. మండలంలోని జొన్నలగడ్డ పరిధిలో గల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ విద్యా విధానం దినోత్సవ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసీదాస్ మాట్లాడుతూ విద్యార్థులు యాత్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవా లని సూచించారు. నేటి విద్యార్థులు సూపర్ కంప్యూటర్స్ గా ఆయన అభివర్ణించారు. విద్యావ్యవస్థ మౌలిక సంస్కరణలో అధ్యాపకులు తప్పనిసరిగా కేంద్ర బిందువుగా మారాలని విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా వారిని ప్రతిష్ఠించాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలు తెలివితేటల ప్రతిరూపాలే దేశ పురోగతికి మార్గాలని తిరుమల విద్యార్థులు ఈ విషయంలో ఎప్పటికీ ముందు ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఎస్-ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించడం పట్ల ఎన్ ఎస్ ఎస్‌పిఓను అభినందించారు. అనంతరం డాక్టర్ డి.తులసీదాసును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, వైస్ చైర్మన్ బత్తిన నాగేశ్వరరావు కోశాధికారి దండా బ్రహ్మనందం, వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతి: మండల పరిధిలోని మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి ని, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు.ఈసందర్భంగా సర్పంచ్ బంకా విష్ణు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం సుదీర్ఘంగా విద్యాశాఖా మంత్రిగా పనిచేసి దేశంలో విద్యా సంస్కరణల చేసి,సమగ్ర విద్యా విధాన రూపకల్పనకు మౌలానా అబుల్ కలామ్ పునాదులు వేశారని ఆయనఅన్నారు. అనంతరం మౌలానా అబుల్ కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి పేరెంట్స్ కమిటీ చైర్ పర్సన్ యం.మాధవి,సలాలుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చిలకలూరిపేట :** స్థానిక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానో పాధ్యాయులు పోటు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పాఠశాల తల్లి దండ్రులు కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలి

కుంచనపల్లిలో కౌలురైతు సంఘం తాడేపల్లి మండల మహాసభ



మాట్లాడుతున్న బైరగాని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి అన్నారు. శుక్రవారం రాత్రి ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల మహాసభ డోకిపర్తి రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కౌలు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా అందరికీ వర్తింప చేస్తామని చెప్పి, కేవలం భూ యజమానులకు రైతు భరోసా వర్తింప చేయటం అన్యాయం అన్నారు. ఈ -క్రాప్ పంట నమోదును కౌలు రైతుల కు చేయడం లేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసాను కౌలు రైతులందరికీ వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. నవంబర్ 14న తెనాలిలో జరుగు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. మహాసభలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు ప్రసంగించారు. అనంతరం 12 మందితో కౌలు రైతు సంఘం మండల కమిటీ ఏర్పడింది. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా డోకిపర్తి రాజేంద్ర బాబు, పల్లె కృష్ణా, 12 మందితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.



నివాళులర్పిస్తున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

ములాయంసింగ్ యాదవ్‌కు బిసి సంక్షేమ సంఘం నివాళి

ప్రజాశక్తి-గుంటూరు : ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నేతాజీ ములాయంసింగ్ యాదవ్ సంస్మరణ సభ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్ అధ్యక్షతన శుక్రవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ మండల్ సిఫార్సుల అమలు కోసం నిరంతరం పోరాడటమే కాకుండా, అప్పటి వరకు కేవలం ఆధిపత్య కులాల చేతిలో మాత్రమే ఉన్న రాజకీయాలను వెనకబడిన కులాలకు పరిచయం చేసి, అన్ని కులాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించి, ప్రతి కులం నుంచి ఒక గొప్ప నాయకుల్ని తయారు చేసిన నిజమైన నాయకుడు ములాయం సింగ్ యాదవ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు, జనసేన రాష్ట్ర నాయకులు బోనబోయిన శ్రీనివాస యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర నాయకులు మధు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లె ఈశ్వర్ రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు నిమ్మల శేసయ్య, ఉప్పుటూరి పేరయ్య, పారేపల్లి మహేష్, దాసరి శివకుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జ్యూయలరీ బ్యాంగిల్స్‌లో శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లి

భారతి ఇంటిగ్రేటెడ్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నులకపేటలోని శివదుర్గాపురంలో త్రెడ్ బ్యాంగిల్స్, జ్యూయెలరీ, ఫ్లవర్ బొకే, టెడ్డీబేర్, హ్యాండ్‌బ్యాగులు, పూలకుండీల తయారీ, టైలరింగ్, విభాగాల్లో శిక్షణనిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ క్రాఫ్ట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగలక్ష్మి పృథ్వీ మాట్లాడుతూ మహిళలు తమ సొంతకాళ్ళపై నిలబడటానికి వీలుగా తమ సంస్థ వివిధ విభాగాల్లో మహిళలకు శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో భార్యాభర్తలు ఇద్దరూ కష్టపడితేనే కుటుంబాలు గడిచే అవకాశం ఉందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా కుటుంబ యజమాని తెచ్చే సంపాదనతోపాటు మహిళలు కూడా కొంత డబ్బు జమచేస్తే కుటుంబాలు సాఫీగా సాగే అవకాశం ఉందని తెలిపారు. తమ సంస్థ వివిధ రకాల చేతివృత్తులను మహిళలు ఇంట్లోనే ఉండి చేసుకునేవిధంగా రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్స్ డైరెక్టర్ జయలక్ష్మి, బర్డ్ ప్రతినిధులు విజయ, ఊర్మిళ, ఆదిలక్ష్మి, శిక్షకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-మేడికొండూరు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన మేడికొండూరు ప్రధాన సెంటర్లో శుక్రవారం జరిగింది. మేడికొండూరు కు చెందిన కొత్తూరి పరమేశ్వరరావు తన ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో సత్తెనపల్లి సమీపంలోని గుడి గ్రామానికి చెందిన వేణు, మల్లికార్జున రావు ఇరువురు ద్విచక్ర వాహనంపై గుంటూరు నుండి సత్తెనపల్లి వైపు వెళుతూ ఎదురుగా ఉన్న ద్విచక్ర వాహనాన్ని బలముగా ఢీకొట్టారు. ఈ సంఘటనలో రెండు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న పరమేశ్వరరావు, వేణు, మల్లికార్జున రావులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయముతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. మేడికొండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - తాడేపల్లి

అత్యవసర విద్యుత్ లైన్ల మరమ్మతులు సందర్భంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.30గంటల వరకు నులకపేట, ఎమ్మార్వో కార్యాలయం, సాయినగర్ ఏరియా, పోలకంపాడు, సినిమాహాలు ఏరియా, అద్దెపల్లివారి వీధి, మరియు ఉండవల్లి సెంటర్‌నుండి బోసుబొమ్మ సెంటర్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఈ ఎ.సత్యనారాయణ, తాడేపల్లి నులకపేట ఏఈ షణ్ముకరావు, తెలిపారు.

దేశాన్ని దివాలా తీయించే పనిలో మోడీ

- పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కునూ ప్రైవేటీకరించే యత్నం
- విభజన హామీలను విస్మరించి రాష్ట్రానికి ద్రోహం
- నిలదీయాల్సిన వైసిపి తివాచీ పరిచి స్వాగతించడం దుర్మార్గం
- పల్నాడు జిల్లా వ్యాప్తంగా వామపక్షాల నిరసన, దిష్టిబొమ్మల దహనం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రధానిగా మోడీ అధికారంలోకి వచ్చిననాటి నుండి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతూ దేశాన్ని దివాలా తీయించడమే పనిగా పెట్టుకున్నారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ విమర్శించారు. మోడీ పర్యటనను నిరసిస్తూ వామపక్షాల నిరసనల్లో భాగంగా శుక్రవారం పల్నాడు జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, దిష్టి బొమ్మ దహనాలు చేపట్టారు. ఇందులో భాగంగా సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్లో దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా అమ్మడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూనుకుందని మండిపడ్డారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీనిచ్చిన మోడీ తన ఎనిమిదేళ్ల పాలనలో ఉన్న ఉద్యోగాలనూ ఊడబీకుతున్నారని దుయ్యబట్టారు. తొలుత సిపిఎం కార్యాలయం నుండి తాలూకా సెంటర్ వరకు నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, జి.మల్లీశ్వరి, జి.రజిని, ఆర్.పురుషోత్తం, షేక్ సాయిబాబా, జి.సుసులోవ్, బి.నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు డి.శ్రీనివాసకుమారి పాల్గొన్నారు.





నరసరావుపేట, వినుకొండలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీలు

ప్రజాశక్తి - నరసరావుపేట

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులివ్వకుండా మట్టి, నీటితో సరిపెట్టడంతోపాటు విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన ప్రధాని మోడీకి వైసిపి ప్రభుత్వం తివాచీలు వేసి స్వాగతం పలుకుతోందని వామపక్ష పార్టీల నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ధర్నా చౌక్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. సిపిఎం నాయకులు కె.రామారావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడారు. ఆయా పార్టీల నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు, డి.శివకుమారి, బి.నాగేశ్వరరావు, కె.ఆంజనేయులు, కాసిం, సుభాష్ చంద్రబోస్, ఐ.కోటేశ్వరరావు, బి.పుల్లారెడ్డి, చిన్నా, వి.వెంకట్, సిహెచ్.సత్యనారాయణ రాజు, యు.రంగయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. శివయ్య స్తూపం వద్ద మోడీ గో బ్యాక్ నినాదాలు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సిపిఎం జిల్లా నాయకులు కె.హనుమంతరెడ్డి మాట్లాడారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి నిధులు, పోలవరం ప్రాజెక్టు తదితర అంశాల్లో రాష్ట్రానికి తీవ్ర ద్రోహాన్ని బిజెపి చేసిందని మండిపడ్డారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, పేదల బ్యాంకు ఖాతాలకు రూ.15 లక్షలు జమ చేస్తామని, రైతులకు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ ఒక్కటైనా నెరవేర్చారా? అని నిలదీశారు. పైగా ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్నారని, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీనీ ప్రైవేటీకరించబూనుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు యు.రాము, కె.శివరామకృష్ణ, బి.సాగర్, పి.వెంకటేశ్వర్లు, ఎ.పవన్ కుమార్, ఆర్.వందనం, ఎం.కోటయ్య, షేక్ మస్తాన్, సాంబయ్య, జె.వెంకటేశ్వర్లు, కె.మల్లికార్జున, బి.కిరణ్, తిరుమలయ్య, పద్మావతి, షేక్ మల్లికా, రమణ పాల్గొన్నారు.

రవాణా రంగాన్నీ కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర

- ఊబర్, ఓలాతో ఇప్పటికే కార్మికుల ఉపాధికి గండి
- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్
- ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ - నూతన కమిటీ ఎన్నిక

జెండావిష్కరణలో ముజఫర్ అహ్మద్, ఇతర నాయకులు, మహాసభ ప్రతినిధులు



ప్రజాశక్తి- పిడుగురాళ్ల

కేంద్ర ప్రభుత్వానికి రూ.1.35 లక్షల కోట్ల ఆదాయాన్ని ఇస్తున్న మోటారు వాహన రవాణా రంగాన్ని కూడా కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్రం సిద్ధమైందని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ అన్నారు. 2019 మోటార్ వాహన చట్టాన్ని తెచ్చి ద్విచక్ర వాహనదారుల మొదలు 10 చక్రాల లారీల వరకు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ పిడుగురాళ్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించారు. మహాసభకు గోళ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించిన ముజఫర్ అహ్మద్ అనంతరం ప్రారంభోపన్యాసం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వివిధ పెనాల్టీలు, ఆటోమొబైల్స్, పెట్రోలు మొదలైన వాటి ద్వారా మోటార్ వాహన రంగం నుండి రూ.1.35 లక్షల కోట్ల ఆదాయం వస్తోందని, అందుకే ఈ రంగాన్ని కార్పొరేట్‌లకు అప్పజెప్పే పనిలో కేంద్రం పడిందని విమర్శించారు. ఇందులో భాగంగానే వాహనదార్లపై ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున పెనాల్టీలు వేస్తోందన్నారు. స్వయం ఉపాధి పొందుతూ ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం తెచ్చిపెడుతున్న మోటార్ వాహన రంగాన్ని కాపాడుకోవడానికి పెద్దఎత్తున పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రధాన పట్టణాల్లో ఇప్పటికే పాసింజర్ ఆటోలపై ఉబర్, ఓలా లాంటి సంస్థల ప్రభావం తీవ్రంగా పడటంతో అనేకమంది ఆటో కార్మికుల ఉపాధికి గండి పడిందని గుర్తు చేశారు. మోటారు వాహన చట్టం -2019ను కేరళ, ఒడిస్సా, బీహార్, తమిళనాడు రాష్ట్రాలు వ్యతిరేకించాయని, ఏపిలో మాత్రం అందుకు భిన్నంగా ఉందని చెప్పారు. కేరళలో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేశాయని తెలిపారు. సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు, సిఐటియు పిడుగురాళ్ల పట్టణ కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఆటో స్టాండ్ల సమస్య తలెత్తినప్పుడు, లైఫ్ ట్యాక్స్ పెనాల్టీలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించామని చెప్పారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించాలని, పోరాటాలకు తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని చెప్పారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్ సైదా, కార్యదర్శిగా మొగిలిపాలెపు హరిపోతురాజు, ఉపాధ్యక్షులుగా పల్లెపోగు రాజు, సహాయ కార్యదర్శిగా శాతరాజుపల్లి రవీంద్ర, ట్రెజరర్‌గా షేక్ శ్రీను, భాష సభ్యులుగా యలమాల శ్రీనివాసరావు, గొల్ల శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, శివకోటి, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న డి.శ్రీనివాసకుమారి

మద్యం, మహిళలపై హింసకు వ్యతిరేకంగా పక్షోత్సవాలు

- జనవరి 3-9 తేదీల్లో ఐద్వా జాతీయ మహాసభలు
- ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు డి.శ్రీనివాసకుమారి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఏర్పాటై 75 ఏళ్లయిన సందర్భంగా ఈనెల 25వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ వరకూ మద్యం, హింస వ్యతిరేక పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు డి.శ్రీనివాసకుమారి తెలిపారు. డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని సభలు, సదస్సులు ఉంటాయన్నారు. ఈ మేరకు ఐద్వా పల్నాడు జిల్లా కమిటీ సమావేశం స్థానిక పుతుంబాక భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ఐద్వా జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్‌బి అధ్యక్షత వహించగా శ్రీనివాసకుమారి మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, మద్యం విచ్చలవిడి అమ్మకాలు ఇందుకు ఒక కారణమని చెప్పారు. నిత్యవసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు, చెత్త పన్ను, విద్యుత్ ఛార్జీల పెరుగుదల మహిళలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని అన్నారు. మహిళలను కించపరిచే అస్లీల చిత్రాలు, వెబ్‌సైట్లను ప్రభుత్వాలు కట్టడి చేయాలని కోరారు. ఈ అన్ని సమస్యలపై ఐద్వా నికరంగా పోరాడుతోందని, మహిళల హక్కుల కోసం ఉద్యమిస్తోందని ఉద్ఘాటించారు. ఐద్వా నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో మహిళలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఇందులో భాగంగా జనవరి 3-9 తేదీల్లో కేరళలో నిర్వహించే ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని, నాయకులు జి.ఉమశ్రీ, ఎస్.దుర్గాబాయి, షేక్ ఫాతిమా, నాగమ్మబాయి, జె.అనూష, నాసర్‌బి, ఎం.జ్యోతి, టి.వీరకుమారి పాల్గొన్నారు.

హెచ్‌ఎం షాహిద్ అలీకి పురస్కారం

ప్రజాశక్తి - అమరావతి

ఆంధ్రప్రదేశ్ స్టేట్ అకాడమీ విజయవాడ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉర్దు ఉత్తమ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా మండలంలోని లింగాపురం ఉర్దు పాఠశాల హెచ్‌ఎం షేక్ షాహీద్ ఆలీ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉర్దు అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ కార్యదర్శి ఇంతియాజ్ ఈ అవార్డును షాహీద్ ఆలీకి ప్రదానం చేశారు. తన కృషిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన ఎంఇఒ ఎం.శ్రీనివాసరావు, ఉర్దు డిఐ ఖాశీమ్‌కు షాహిద్ అలి కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డును అందుకుంటున్న ప్రధానోపాధ్యాయులు షేక్ షాహిద్ అలీ

మోడీ విశాఖ పర్యటనపై నిరసన వెల్లువ

గుంటూరులో కార్మిక సంఘాల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన ప్రధాని మోడి ఏపీ పర్యటనను నిరశిస్తూ శుక్రవారం గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు నిరసన తెలిపారు. మోడీ గోబ్యాక్..విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేయాలి..అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ మోడీకి ఏపిలో పర్యటించే హర్హత లేదని అన్నారు. రాష్ట్రానికి విభజన హామీలు ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రత్యేక హోదా, రాష్ట్ర రాజధానికి, పోలవరంకు నిధులు లేవని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక నిధులు, విశాఖ రైల్వే జోన్ వంటి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఏపీలో ఉన్న ఏకైక ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటు పరం చేయటానికి ప్రయత్నాలు చేయటం అన్యాయమన్నారు. తెలుగు ప్రజలంతా బిజెపి రాష్ట్రానికి చేస్తున్న ద్రోహాన్ని ప్రశ్నించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.శ్రీనివాస్, బి.లక్ష్మణరావు, నికల్సన్, మెడికల్ రిప్రజెంటివ్స్ యూనియన్ నాయకులు జిలానీ, సలీం, ఎఐటియుసి నాయకులు మాల్యాద్రి, అరుణ్, అంజిబాబు పాల్గొన్నారు.


తుళ్లూరులో


మంగళగిరిలో


దుగ్గిరాలలో


తాడికొండలో

పలుచోట్ల వామపక్షాల రాస్తారోకో, నిరసనలు

ప్రజాశక్తి - తుళ్లూరు: ప్రధాని మోడీ విశాఖ రాకను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక లైబ్రరీ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. మోడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. రాస్తారోకోని ఉద్దేశించి సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, సిపిఐ తాడికొండ నియోజకవర్గం కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, ఏఐటీయూసీ కార్యదర్శి జివి రాజు,సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజులు మాట్లాడుతూ, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా ఆంధ్ర ప్రజలని మోసం చేసిన మోడీకి ఆంధ్రప్రదేశ్లో పర్యటించే నైతిక అర్హత లేదని అన్నారు. ఆంధ్రులు 32 మంది తమ ప్రాణాలను బలిదానం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును కారు చౌకగా కార్పొరేట్లకు దారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్న మోడీ విశాఖపట్నం పర్యటనను ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ వ్యతిరేకించాలని వారు కోరారు. రాస్తారోకోలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, డివిజన్ నాయకులు పేరం బాబురావు, కుంభా ఆంజనేయులు, షేక్ మహబూబ్, సుభాని సిపిఐ నాయకులు షేక్ నాగుల్ మీరావలి, కంభంపాటి దేవునిదయ, సత్యనారాయణ పాల్గొన్నారు. **దుగ్గిరాల:** మోడీకి ప్రభుత్వం స్వాగతం పలికి సభలు నిర్వహించడం సిగ్గుచేటని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకర్ అన్నారు. దుగ్గిరాలలో మోడి విశాఖ పర్యటనను నిరసిస్తూ చేపట్టిన నిరసనలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి సాంబశివరావు, జె బాలరాజు, అద్దంకి పాములు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరావు, భీమవరపు అమ్మిరెడ్డి సిపిఐ ఎంఎల్ కు చెందిన లోకం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. **తాడికొండ:** తాడికొండ బస్టాండ్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, సిపిఐ నాయకులు ముప్పాళ్ల శివ శంకరరావు, జివి రాజు, నాగుల్ మీరా, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **మంగళగిరి :** నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటనను వ్యతిరేకిస్తూ మంగళగిరి పట్టణంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, సిపిఐ ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. గో బ్యాక్ నరేంద్ర మోడీ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్, ఎం బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, పట్టణ నాయకులు కే ఏడుకొండలు, సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, ఏ ప్రభాకర్, కే ఈశ్వరరావు, గంజి వెంకయ్య, సిపిఐ ఎంఎల్ నాయకులు కే కోటేశ్వరరావు, ఆదినారాయణ, ప్రసాదు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి నాగ కుమార్, జి వెంకయ్య వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చెత్త పన్ను రద్దు కోసం ఆందోళన తీవ్రతరం

ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - మంగళగిరి: మంగళగిరి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో కార్పొరేషన్ అధికారులు వసూలు చేస్తున్న చెత్త పన్ను రద్దు చేయాలని మంగళగిరిలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ చెత్త పన్ను రద్దుకై ఆందోళనలను తీవ్రతరం చేయాలని అన్నారు. సిపిఎం కార్యాలయంలో ఆపార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వి జవహర్లాల్ అధ్యక్షతన సమావేశంలో 20న ప్రచారం, 21న పట్టణంలో నిరసన ప్రదర్శన చేయాలని నిర్ణయించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ పట్టణంలో తొలుత ఆంజనేయ కాలనీలో చెత్తపన్ను వసూలు సిపిఎం ఆందోళనతో ఆపారన్నారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో చెత్తపన్ను వసూలుకు సచివాలయ ఉద్యోగులు, వాంటీర్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తూ, చెల్లించకుంటే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం నెలలో లెక్క కాకుండా రోజువారీగా రూ.10 చొప్పున పన్ను వసూలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలుస్తుందన్నారు. ఈ లెక్కన సంవత్సరానికి రూ. 3600 చెత్త పన్ను చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. దీనిపై దశల వారి ఆందోళన వివిధ రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని సంఘటితంగా ఉద్యమించడానికి ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు ఏ ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా పన్నులను పెంచుకుంటూ పోతుందని విమర్శించారు. సిపిఐ ఎం ఎల్ నాయకులు కే కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల రత్నాల చెరువులో మొదటి తేదీన పెన్షన్ పంపిణీ చేసి సాయంత్రం ఇంటి పన్ను వసూళ్లకు వాలంటీర్లు వచ్చారని తెలిపారు. దీన్నిబట్టి ప్రభుత్వం పగడ్బందీగా ప్రజలపై భారాలు వేసి వసూలు చేయడానికి సిద్ధపడుతున్నట్లుగా ఉందని తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని అన్నారు. టిడిపి నాయకులు గోవాడ దుర్గారావు మాట్లాడుతూ ఇప్పటికే ఇంటింటికి తిరిగి టిడిపి ఆధ్వర్యంలో పన్నుల భారాల గురించి తెలియజేస్తున్నామని, ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గోలి నాగ కుమార్ మాట్లాడుతూ వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టే ఆందోళన కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ పట్టణ కార్యదర్శి వి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెత్త పన్ను రద్దు చేసే వరకు ఆందోళన చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం పట్టణ నాయకులు ఎం బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకష్ణ, సిపిఐ నాయకులు చిన్ని సత్యనారాయణ, బి శ్రీనివాసరావు, కె ఈశ్వరరావు, టిడిపి నాయకులు వాకా మాధవరావు, గోశాల రాఘవ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గండికోటి వెంకయ్య, సిపిఐ ఎంఎల్ నాయకులు ఆదినారాయణ, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెంగయ్య

26వ రోజుకు పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు విడుదల చేయాలని పని భద్రత కల్పించాలని శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పని గ్యారంటీకై జనవరి నుండి కొత్త టెండర్ను సిఆర్‌డిఎ అధికారులు పిలవాలని కోరారు. ఈ సంవత్సరం డిసెంబర్‌తో సుమిత్ కంపెనీ టెండర్ పూర్తికావస్తున్న నేపథ్యంలో కొత్త టెండర్ పిలవాలన్నారు. తక్షణం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాన్ని వెంటనే ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే తమ ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఓ రామారావు, తోకల ఆదిలక్ష్మి, కే కోటేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలసాధన విద్యతోనే సాధ్యం

ఎన్నారై ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవంలో ప్రిన్సిపల్ కోట శ్రీనివాసు

ప్రజాశక్తి -మేడికొండూరు

జీవితంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే ఉన్నత విద్యతోనే సాధ్యమని ప్రిన్సిపల్ డాక్టర్ కోట శ్రీనివాసు తెలిపారు. శుక్రవారం మండలంలోని విశదల వద్ద ఎన్నారై ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతు విద్య పట్ల విద్యార్థులు సదభిప్రాయం కలిగి ఉండాలన్నారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరి రూపురేఖలు మారాలంటే అది ఒక విద్యతోనే సాధ్యమన్నారు. విద్య అనేది ఒక జ్ఞాన సంపద అని విద్యార్థులకు తెలియపరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మేము క్రమశిక్షణతో, కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగం సంపాదించి, కుటుంబానికి, కళాశాలకు మంచి పేరు తెచ్చి మా జీవితాలను విద్య ద్వారా స్థిర పరచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమములో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరిరావు, వివిధ విభాగాల అధిపతులు రాము, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ రెహమాన్, డాక్టర్ మల్లేశ్వరి, ఏవో సీతారామయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాజధాని మాస్టర్‌ప్లాన్‌పై నేడు గ్రామ సభలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిలో గత ప్రభుత్వం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో పలుమార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులపై శనివారం గ్రామ సభలు నిర్వహించాలని సిఆర్‌డిఏ అధికారులు నిర్ణయించారు. శుక్రవారం మందడం, లింగాయపాలెంలో సభలు నిర్వహించగా మిగతా గ్రామాల్లో శనివారం సభలు నిర్వహించాలని నిర్ణయించారు. హైకోర్టు ఆదేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మారిన ప్లాన్ ప్రకారం ఆర్-5 జోన్ పేరిట పేదల ఇళ్ల కోసం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేశారు. రాజధాని పరిధిలో 5 గ్రామాలలో 900 ఎకరాలను ఇళ్ల స్థలాలకు జోనింగ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. అభిప్రాయాలను గ్రామసభల ద్వారా వివరిస్తామని పేర్కొన్నారు. దీంతో గ్రామసభల నిర్వహణకు అధికారులను నియమించారు. తుళ్లూరు మండలంలో ఇంకా 14 గ్రామాల్లో సభలు జరగనున్నాయి. మంగళగిరి మండలంలో మూడు గ్రామాల్లో సభలు నిర్వహించాల్సి ఉంది.

కాజలో నేడు వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా మహాసభ

'ప్రభుత్వ విధానాలు - వ్యవసాయ కార్మికులపై ప్రభావం'పై సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా 29వ మహాసభలు ఈ నెల 12వ తేదీన మంగళగిరి మండలం కాజ గ్రామంలో జరుగుతున్నాయని ఈ సందర్భంగా "ప్రభుత్వ విధానాలు – వ్యవసాయ కార్మికులపై ప్రభావం" అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు. సెమినారుని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మహాసభలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కూలిరేట్ల గురించి చర్చిస్తామని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావడం కోసం, జగనన్న కాలనీలలో మౌలిక వసతులు గురించి, అలాగే ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను అనేక చోట్ల ఆక్రమణకు గురయ్యాయని వీటి గురించి మహాసభలో చర్చించి కార్యాచరణ చేస్తామని తెలిపారు. 12వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రభుత్వ విధానాలు వ్యవసాయ కార్మికుల ప్రభావం అనే సెమినార్లో ఆంధ్రప్రదేశ్ వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళా కన్వీనర్ వంకాయలపాటి శివ నాగరాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామారావు తదితరులు హాజరవుతారని తెలిపారు.



అటవీ భూముల్లోని పేదలకు ఇళ్లపట్టాలు

మంగళగిరి పర్యటనలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి: తనని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంగళగిరి కొండ పారంబోకు స్థలాల్లో ఇల్లు వేసుకొని నివసిస్తున్న పేదలందరికీ డి ఫారెస్ట్ చేసి అందరికీ పట్టాలిస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం రాత్రి మంగళగిరి పట్టణంలోని ఐదో వార్డులో వైసిపి నుండి టిడిపిలోకి చేరిన సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేకి గెలిచిన రామకృష్ణారెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, రోడ్లు, పైప్ లైన్ లేచి తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేకపోయారని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో పదివేల మంది పేదలకు ఇల్లు కట్టించి ఇస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఇప్పటం గ్రామంలో 120 అడుగుల రోడ్డు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, దామర్ల రాజు, కారంపూడి ఎంకమ్మరావు, భోగి వినోద్, పడవల మహేష్, గోసాల రాఘవ, గోవాడ దుర్గారావు, తమ్మిశెట్టి జానకి దేవి, ఎం వైష్ణవి, ఆరుద్ర భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం రైతుల వేడుకోలు

ప్రజాశక్తి - అచ్చంపేట

వీలైనంత త్వరగా తమకు నష్టపరిహారం ఇప్పించాలని లామ్ శాస్త్రవేత్తల బృందాన్ని, వ్యవసాయ అధికారులను రైతులు వేడుకున్నారు.గంగా కావేరి కంపెనీకి చెందిన సిక్సర్ పత్తి విత్తనాలు కొనుగోలు చేశామని తాళ్ళ చెరువుకు చెందిన రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ పొలాలను లామ్ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ కిషోర్, డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ డాయాను బృందం పరి శీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల బృందం రైతులతో విత్తనాలు నాటినప్పటి నుండి ఎంత మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడారో, ప్రత్తికాయ సైజును, చెట్టు ఎదుగుదల గురించి, పలు విషయాలను రైతులను అడిగి శాస్త్రవేత్తల బృందం తెలుసు కుంది. అనంతరం విలేకరులతో శాస్త్రవేత్తల బృందం మాట్లాడుతూ అన్ని కోణాలలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. రైతులు వీలైనంత త్వరగా నష్టపరిహారం ఇప్పించాలంటూ శాస్త్రవేత్తల బృందాన్ని, వ్యవసాయ అధికారులను వేడుకున్నారు. వ్యవసాయ శాఖాధికారులు వి.హనుమంతరావు, వి.వేణు గోపాల్, రైతు సంఘం నాయకుడు టి.మర్రెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు


పొలాలను పరిశీలిస్తున్న లామ్ శాస్త్రవేత్తలు



ఓటు హక్కుకోసం నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలో, నియోజకవర్గపరిధిలో 18-19 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దారు జి. సుజాత అన్నారు. ఎస్‌విఈఈపి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఈఎంజి డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆమె పాలొన్నారు. తహశీల్దారు మాట్లాడుతు ప్రతి ఒక్కరు తమ ఓటును నిర్భయం గా వినియోగించుకోవాలని, వారితో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించి, మాన్యువల్ ఫారం-6 ఆర్జీలను అందజేశారు. కార్యక్రంలో సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి , మున్సిపల్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు, టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి సునీత, ఎలక్షన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి

ప్రజాశక్తి - రెంటచింతట

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడానికి అధికారులు కృషి చేయాలని ఎంపిపి దాసరి చౌడేశ్వరి కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించగా ఎంపిపి మాట్లాడుతూ జెట్టిపాలెం మోడల్ స్కూల్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని అదనపు సర్వీసులు ఏర్పాటు చేయాలని, నరసరావుపేట, రెంటచింతల, గురజాల మీదుగా ఎక్స్‌ప్రెస్ బస్సును వేయాలని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించారు. వివిధ శాఖల్లో ప్రగతిపై అధికారులు వివరించారు. పథకాల అమలులో జిల్లాలో రెంటచింతల ప్రథమ స్థానంలో ఉందని, ఇందుకు జిల్లా కలెక్టర్ సైతం అభినందించారని ఎంపిడిఒ గౌసియాబేగం చెప్పారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, వైస్ ఎంపిపి వై.శౌర్రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



రొంపిచర్లలో డిటిడిసి కొరియర్ ప్రారంభం

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం డిటిడిసి కొరియర్ కేంద్రమును ప్రారంభించటం జరిగింది. ఈ కేంద్రమును స్థానిక ఎస్ బి ఐ బ్యాంకు మేనేజర్ ఎ. నాగలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిటిడిసి కొరియర్ కేంద్రము ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఇక్కడ కొరియర్ కేంద్రము ప్రారంభించటం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మధు, డిటిడిసి సిఎంసి సుధాకర్, బ్యాంక్ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఈనెల 14 నుండి 20 వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సత్తెనపల్లి లోని వైఎస్సార్ శాఖా గ్రంథాలయం లో వారం రోజులపాటు జరుగుతాయని సత్తెనపల్లి శాఖ గ్రంథాలయం లైబ్రరీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ సోమవారం గ్రం థాలయ వారోత్సవాల్లో భాగంగా బాలల దినో త్సవం జరుగుతుందని, మంగళవారం పుస్తక ప్రదర్శన మాదక ద్రవ్యాలపై అవగాహన -పుస్తక పఠనం ప్రాముఖ్యత తెలియజేస్తారని తెలి పారు. బుధవారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్సార్ రంగనాథ్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమ ణయ్య మొదలైన వారిని స్మరించడం, గురు వారం కవి సమ్మేళనాలు, సెమినార్లు రచ యితల సందేశాలు తెలియజేయడం జరుగు తుందని తెలిపారు, శుక్రవారం పాఠశాల విద్యా ర్థినీ విద్యార్థులకు చిత్రలేఖనం వ్యాసరచన వకత్వ క్విజ్ మరియు క్రీడా పోటీలు జరుగు తాయని, శనివారం దిశా చట్టం, మహిళా సాధి కారత పై చర్చ జరుగుతుందని ఆమె తెలి పారు. ఆదివారం డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయ పఠనం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలలో పట్టణ పరిసరాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, పుస్తక ప్రియులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు.

తక్కువ వడ్డీతో రుణాలిచ్చేందుకు నూతన స్కీమ్‌లు


ద్విచక్ర వాహనాలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి-ఈపూరు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 104వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా తక్కువ వడ్డీతో రుణాలు ఇచ్చేందుకు నూతన స్కీంలను ప్రవేశపెట్టిందని బ్యాంక్ మేనేజర్ పి రమేష్ బాబు అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈపూరు బ్రాంచ్‌లో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఖాతాదారుల సమావేశంలో మేనేజర్ పి. రమేష్ బాబు మాట్లాడుతూ పొలం లేకపోయిన తక్కువ వడ్డీకే బంగారం రుణం ఇస్తామన్నారు. ఐదు లక్షల వరకు బంగారం రుణం పొందే వారికి రూ. 500 మాత్రమే చార్జి వసూలు ఉంటుందన్నారు. కార్లు,ద్విచక్ర వాహనాలను తక్కువ వడ్డీతో అందజేస్తామన్నారు. అనంతరం బ్యాంకు రుణం ద్వారా పొం దిన ద్విచక్ర వాహనాలను రుణ గ్రహీతలకు మేనేజర్ అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ కె.తులసి కుమార్, సుజిత్, మణికంఠ, సుస్మిత,సిబ్బంది పాల్గొన్నారు. **రెంటచింతల:** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాల కింద రూ.132 కోట్లు మంజూరు చేశామని యూనియన్ బ్యాంక్ మేనేజర్ విశాల్ ఉప్రే తెలిపారు. యూనియన్ బ్యాంక్ 104వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బ్యాంక్ ఆవరణలో శుక్రవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ రూ.45 కోట్ల డిపాజిట్లు సేకరించామని, గతేడాదితో పోలిస్తే 10 శాతం వృద్ధి ఉందని చెప్పారు. గ్రాము బంగారానికి రూ.3200 రుణం ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ఎన్.భాస్కం రెడ్డి, వ్యాపారి జి.హనుమంతరావు, టిడిపి మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది రవికుమార్, బిన్‌కదమ్, జిలానిబాషా పాల్గొన్నారు.



అమరేశ్వర ఆలయానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - అమరావతి

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని శ్రీ బాలచాముండిగా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానం లో జరిగే నిత్య అన్నదాన పథకానికి కార్తీకమాసం సందర్భంగాభగవాన్ ట్రేడర్స్ అధినేత నడింపల్లి వెంకటరామరాజు లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ సభ్యులు మంతెన రామ కుమార్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష రూపాయల చెక్కును ఆలయ కార్య నిర్వహణ అధికారి సునీల్ కుమార్ కు అందజేశారు. కార్యక్రమంలో భట్టిప్రోలు. శ్రీనివాసరావు, రాయపోలు భగవాన్ తో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - వినుకొండ

తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్ వారి 101వ ఫౌండర్స్ డే ను పురస్కరించుకొని స్థానిక నిర్మల గర్ల్స్ హైస్కూల్‌లోని నిరుపేద విద్యార్థినీలకు స్వీట్స్, దుప్పట్లు బ్యాంక్ మేనేజర్ ఎస్.అరుణ్ కుమార్ అందజేశారు.

నాడు-నేడు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయపురిసౌత్



విజయపురిసౌత్ లోని సాగర్ క్యాంపు-1 పాఠశాలలో ఫేజ్ -2 కింద నాడు-నేడు పనులకు వ్యవసాయ సలహా మండలి సభ్యులు శౌరెడ్డి గోపిరెడ్డి ఆధ్వ ర్యంలో శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. గోపిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్,మరుగుదొడ్లు తదితర మరమ్మతుపనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి సీఎం జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాచర్ల ఎంఈఓ వేముల నాగయ్య, వైసిపి జిల్లా కార్యదర్శి టి.పరమేశ్వరరావు, వైసిపి నాయకుడు బూడిద శ్రీను, తంగిరాల రామిరెడ్డి,ధర్మవరపు సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-ఈపూరు

11 కెవి,33 కెవి విద్యుత్ లైన్లు,విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ల మరమ్మత్తుల కారణంగా ఎ ముప్పాళ్ళ,ఊడిజర్ల, కొచ్చర్ల విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి షేక్ రఫీ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

యూత్ ఫెస్టివల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - నరసరావుపేట

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యువజన సర్వీసుల శాఖ- స్టెప్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు ఈ నెల 19న నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ పరిధిలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పల్నాడు జిల్లా స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి పి.వెంకట నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 15 నుండి 29 ఏళ్ల మధ్య వయసున్న యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులలన్నారు. పోటీలోని అంశాలను వివరించారు. జాతీయ స్థాయి పోటీలలో క్లాసికల్ ఓకల్ (కర్ణాటక, హిందూస్తాని), క్లాసికల్ డాన్స్ (కూచిపూడి, భరతనాట్యం, కథక్, మణిపూరి, ఒడిస్సీ), క్లాసికల్ ఇస్ట్రుమెంట్స్ (వీణ, సితార, తబలా, మదంగం, గిటార్, ఫ్లూట్, హర్మోణ్యం), వన్ యాక్ట్ , ఎలక్యూషన్, ఫోక్ సాంగ్ (గ్రూప్), ఫోక్ డాన్స్ (గ్రూప్). రాష్ట్ర స్థాయి పోటీలలో ఎలక్యూషన్, క్విజ్, మోడరన్ సాంగ్ (సోలో), మోడరన్ డాన్స్(సోలో), మేజిక్, మిమిక్రీ, మోనో యాక్షన్, వెంట్రిలాక్విజమ్, వయో లిస్, పెయింటింగ్, ఫ్యాన్సీ డ్రస్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 18 లోగా %https://bit.ly/palnadu% లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0863-2234176/ 9441485423 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అగ్ని వీర్ వాయు ఉద్యోగాలకు దరఖాస్తులు

భారత వాయుసేనలో అగ్నిపథ్ కింద అగ్నివీర్ వాయు ఉద్యోగాలు ఎంపిక పరీక్ష కోసం అవివాహితులైన యువతీ యువకుల నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు యువజన సర్వీసుల శాఖ- స్టెప్ ఉమ్మడి గుంటూరు జిల్లాల ముఖ్య కార్యాల నిర్వహణ అధికారి పి.వెంకట నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ ఇన్స్టిట్యూట్ నుండి ఇంజనీరింగ్ లో మూడేళ్ల డిప్లమా కోర్స్(మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్స్టుమెంటేషన్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) లలో 50% మార్కులతో సాధించి ఉండాలన్నారు. నాన్ వోకేషనల్ సబ్జెక్టుతో రెండేళ్ల ఒకేషనల్ కోర్సు ఉత్తరులై ఉండాలన్నారు. రాష్ట్ర విద్యా బోర్డులు కౌన్సిల్స్ నుండి మ్యాథమెటిక్స్ ఒకేషనల్ కోర్సులో ఆంగ్లంలో 50% మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు 2002 జూన్ 27 నుండి 2005 డిసెంబర్ 27 మధ్య జన్మించి ఉండాలని, పురుష అభ్యర్థులు 152.5, మహిళా అభ్యర్థులు 152 సెంటీ మీటర్ల ఎత్తు ఎత్తుకు తగ్గ బరువు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 23 లోగా %ష్ట్రజూజూం://ఖస్త్రఅఅజూఫ్ష్ట్రఋఎబ.ఎఋఎ.అఅ% వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పిడి

బిందు సేద్యంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - దుగ్గిరాల : బిందు సేద్యం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు గుంటూరు జిల్లా పిడి ఎల్. వజ్రశ్రీ అన్నారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్ర వారం జరిగిన మండల సలహా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు నుండి బిందు సేద్యం పథకం ప్రారంభమైనట్లు తెలిపారు. బిందు సేద్యం వల్ల ప్రతి మొక్కకు సమానంగా నీరు, ఎరువులు అందించవచ్చని, సమయం వృధా కాదు, ఖర్చు తక్కువ, ఎక్కువ దిగుబడి పొందవచ్చన్నారు. ఐదు ఎకరాల లోపు చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం, ఐదు ఎకరాలు దాటితే 50 శాతం,తుంపర్ల సేద్యానికి చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం, ఐదెకరాలు దాటితే 45 శాతం సబ్సిడి ఇస్తుందన్నారు.

రైతుల విజ్ఞానయాత్ర

ప్రజాశక్తి - చేబ్రోలు: బిందు సేద్యం, తుంపర్ల సేద్యం పద్ధతులపై రైతుల విజ్ఞాన యాత్ర కార్యక్రమంలో భాగంగా చేబ్రోలు మండలంలోని రైతులను మంగళగిరి మండలం నూతక్కి గ్రామం తీసు కువెళ్లినట్లు యంఏఓ బి.శ్రీనివాస నాయక్ తెలి పారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ), జిల్లా వనరుల కేంద్రం డిఆర్‌సి గుంటూరు ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహించినట్లు చెప్పారు.

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయంలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకూ 55వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాలలో భాగంగా 14న మధ్యాహ్నం 12 గంటలకు చిత్ర లేఖనం పోటీలుంటాయని, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంధాలయ ఉద్యమ ప్రముఖులపై ప్రసంగాలు, 17న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 18న కవి సమ్మేళనం, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు సమావేశం, చివరి రోజు విజేతలకు బహుమతి ప్రధానం ఉంటుందన్నారు.

తుళ్లూరు: ఈ నెల 14 వ తేదీ నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు స్థానిక శాఖా గ్రంథాలయాధికారి టి.గిరిధర్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

16న పాఠశాల పాత సామగ్రి వేలం

ప్రజాశక్తి - తాడికొండ : తాడికొండలోని ఆధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల రీజనల్ సెంటర్ ఎక్సెలెన్స్‌లో పాత ఇత్తడి, ఇనుము, అల్యూమినియం, స్టీల్, చెక్క సామగ్రిని బహిరంగ వేలం వేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. బాలశ్రీ శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి ప్రిన్సిపాల్, రీజినల్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్, తాడికొండ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.5 వేలు డి.డి రూపంలో ధరావతు జమ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9866559633ను సంప్రదించాలన్నారు.

ప్రధాని మోడీ ఫైబర్ గ్లాస్ విగ్రహం సిద్ధం

ప్రజాశక్తి-తెనాలి

గతంలో ప్రధాని మోదీ విగ్రహాన్ని ఐరన్ స్క్రాప్‌తో తయారు చేసిన తెనాలిలోని సూర్య శిల్పశాల శిల్పులు తమ కళా ప్రతిభను చాటిన సంగతి తెలిసిందే. తాజాగా, మోదీ ఫైబర్ గ్లాస్ విగ్రహాన్ని అద్భుతంగా తయారు చేశారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవి చంద్ర రూపొందించిన ఈ విగ్ర హాన్ని బెంగళూరులో ప్రతిష్ఠించేం దుకు తరలిస్తున్నట్లు వారు తెలిపారు. 13 అడుగుల మోదీ విగ్రహాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గురువారం సందర్శించారు. శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. 21 అడుగుల పునీత్‌రాజ్ విగ్రహాన్ని కూడా తీర్చిదిద్దిన శిల్పులు, 21 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తయారు చేస్తున్నట్లు చెప్పారు.


మోదీ విగ్రహాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

ఆక్రమణలు తొలగించండి

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక మహాత్మా గాంధీ కూరగాయల మార్కెట్ ఆవరణలో ఆక్రమణలను తొలగించాలని, నూరు శాతం చెత్త పన్ను వసూలు చేయాలని కమిషనర్ ఎం.జస్వంత్ రావు చెప్పారు. పట్టణ పర్యటనలో భాగంగా శుక్రవారం కూరగాయల మార్కెట్, మారిస్ పేట రావి రవీంద్రనాథ్ నగర్ లో ఏర్పాటు చేసిన బయో రెమి డేషన్ ఆఫ్ డ్రెయిన్స్, కంపోస్ట్ యార్డ్ లను ఆయన పరిశీలిం చారు. మార్కెట్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన స్టాల్స్ పై కమిషనర్‌కు పలువురు వ్యాపారులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణలో అలసత్వం వద్దని, ప్రజలు కూడా చెత్తను ఆటోలకు అందించాలన్నారు. టీ స్టాల్స్ నిర్వాహకులు విధిగా డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో రూ. 500 అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. నూరు శాతం చెత్త పన్ను వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు


తెనాలి కూరగాయల మార్కెట్‌లో ఆక్రమణలను పరిశీలిస్తున్న కమిషనర్

డిసిఎంఎస్ బలోపేతానికి సహకరించాలని వినతి

ప్రజాశక్తి - తెనాలి

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) బలోపేతానికి ప్రభుత్వం సహకరించాలని సొసైటి చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌ను కోరారు. అధికారిక కార్యక్రమాలలో పాల్గొనేందుకు శుక్రవారం గుంటూరు వచ్చిన సీఎంను ఆమె కలిశారు. డీసీఎంఎస్ నుంచి రైతులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులకు మరింత ప్రయోజనం చేకూరాలంటే ప్రభుత్వ పరంగా ఆర్థిక ప్రోత్సాహం అవసరమని సీఎంను కోరారు. ఆమేరకు సిఎంకు వినతిపత్రం సమర్పించినట్లు డిసిఎంఎస్ జిల్లా మేనేజర్ డి.హరగోపాల్ తెనాలిలో తెలిపారు.





రంగస్థల నటుడు కర్నాటి బాలిరెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్: ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం ప్రదర్శించిన 'నాదేశం' చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేషాదరణ లభించింది. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈఉత్సవాల్లో కళాకారులను సత్కరిస్తున్నారు. పట్టణానికి చెందిన సీనియర్ రంగస్థల, పౌరా ణిక నటులు కర్నాటి బాలిరెడ్డిని ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు.

మందడంలో ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - తుళ్లూరు:మందడంలో టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అమరావతి రాజధాని ప్రజా చైతన్య యాత్ర జరిగింది. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా కంటక పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ విమర్శించారు.

విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్: కొత్త గా చేరిన విద్యార్థుల్లో భయాన్ని తొలగించుటకు ఫ్రెషర్స్ డే వేడుకలు దోహదపడుతాయని పొన్నూరు మండల విద్యాశాఖాధికారి ఆర్. శోభచంద్ అన్నారు. శుక్రవారం పొన్నూరు వెలగ నాగేశ్వరరావు ఇంజనీరింగ్ కళాశాలలో పాలెటెక్నిక్ సెకండ్ షిఫ్ట్ కు సంబంధించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.

విద్యలో సైద్ధాంతిక నిర్మాణంతోనే సమాజం అభివృద్ధి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

దేశంలో విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసు కోవాలని వర్సిటీ వీసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో భారత తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ దినోత్సవంలు శుక్రవారం జరిగాయి. ఆచార్య పి. బ్రహ్మాజీరావు అధ్యక్షత వహించారు. విసి రాజశేఖర్ మాట్లాడుతూ నేటి విద్యావ్యవస్థ తరగతి గదినుంచి సమాజంలోకి వెళ్ళినప్పుడు విద్యకు పరమార్థం ఉంటుందన్నారు. అటువంటి మార్పులు తీసుకువస్తేనే మౌలానా ఆజాద్‌కు నిజమైన నివాళి అర్పించినట్టైతుందని పేర్కొన్నారు. విద్యలో సైద్ధాంతిక నిర్మాణం జరగాలని సూచించారు. దేశంలో ఉన్న గొప్ప సంఘ సంస్కర్తలు ఎన్నో సంస్కరణలు చేశారని, వాటిని ముందుకు తీసుకెళ్ళాలంటే ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే మైనారిటీస్ సంక్షేమానికి కృషి చేయాలన్నారు.


అబుల్ కలాం ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న ఏఎన్‌యు వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కీలకోపన్యాస కులుగా పాల్గొన్న విజయవాడలోని ఇగ్నో రీజనల్ డైరెక్టర్ ఆచార్య కె. సుమలత మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ద్వారా విద్యా విధానంలో మార్పులు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో భారత్ విద్యా రంగంలో ఇరత దేశాలకు విశ్వగురువుగా నిలుస్తుందన్నారు. ఆర్ట్స్ కళాశాల డీన్ డా. ఎం. ఎస్తేరు సునీల, బిఓఎస్ చైర్మన్ డాక్టర్ జి.ఆర్.ప్రియదర్శిని, డా. సరోజ, డా.టి. విమల, అధ్యాపకులు డా.ఎం.వసంతరావు, డా. సందీప్ పాల్గొన్నారు.

గుంటూరు: స్థానిక చౌత్రా సెంటర్‌లోని ఉర్దూ డిఐ కార్యా లయంలో, సంగడిగుంటలోని జైన్ హైస్కూల్‌లో అబుల్ కలాంకు నివా ళులర్పించారు. రైలుపేటలోని కన్నా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా ఉపకరణాలు అందజేశారు. **తాడికొండ :** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామారావు తదితరులు పాల్గొన్నారు. **మంగళగిరి:** స్థానిక కాం గ్రెస్ పార్టీ కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పార్టీ ఇన్‌ఛార్జి షేక్ సలీం, నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. పొన్నూరులో అబుల్ కలాం ఆజాద్‌కు ముస్లిం యునైటెడ్ పొన్నూరు ఫ్రంట్ నివాళులర్పించింది.



హెచ్ఐవిపై సిరిపురంలో అవగాహన

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని సిరిపురం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటి (ఏపియస్‌ఏసియస్) ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ లింక్ వర్కర్స్ స్కీమ్ గుంటూరు లోని 103 గ్రామాల్లో జరుగుతున్న క్రమంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్.పి వాసుదేవరావు తెలిపారు. సిరిపురంలో హెచ్ఐవి ఎయిడ్స్ గురించి పనిచేస్తున్నామని, గ్రామంలో ఉన్న హైరిస్క్ గ్రూప్ వారిని గుర్తించి వారికి హెచ్ఐవి ఎలా వస్తుంది, ఎలా రాదు అనే అంశాలు గురించి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ కె.త్రివేణి, ఎంఎల్‌హెచ్ పి.జహీర్ మాట్లాడారు.

యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-తెనాలి

యూనియన్ బ్యాంక్ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ కె.సంధ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పట్ట ణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పురుషోత్తమ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ మాట్లాడుతూ 1919 నవంబర్ 11న యూనియన్ బ్యాంక్ ఆవిర్భవిం చిందన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇస్తును వడ్డీరేట్లను వివరించారు. ఖాతాదారుల అభిమానంతో బ్యాంక్ పురోభివృద్ధిని సాధించిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ డేవిడ్ రాజు, సిబ్బంది ఆదిత్య, రాజు పాల్గొన్నారు.



షుగర్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ప్రపంచ షుగర్ దినో త్సవం సందర్భంగా పొన్నూరు బాలాజీ హాస్పి టల్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లకార్ట్‌లు ధరించి బాలాజీ హాస్పిటల్ నుండి ఎస్‌పిపి రోడ్, గాంధీ బొమ్మ సెంటర్, తోటలమ్మ గుడి, మార్కెట్ మీదగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆహారం, వ్యాయామం సక్రమంగా ఉండేలా చూసుకుంటే దీని బారిన పడకుండా ఉండవచ్చన్నారు.వైద్యుల సూచనల ప్రకారం పసి పిల్లలకు పుట్టిన వెంటనే వ్యాక్సిన్ వేయించాలన్నారు. జిల్లా ఎఎబి బోర్డు డైరెక్టర్ బి.రంగారావు, హాస్పిటల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జనసేన మంగళగిరి-తాడేపల్లి అధ్యక్షుడికి సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

జనసేన పార్టీ మంగళగిరి-తాడేపల్లి నగర అధ్యక్షునిగా మునగ పాటి మారుతీరావును నియమిస్తూ ఇటీవల ఆ పార్టీ వ్యవ స్థాపక అధ్యక్షులు పవన్‌కల్యాణ్ నియామకపత్రం అంద జేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక పార్టీ కార్యా లయంలో మారుతీరావును జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ సీనియర్ నాయకులు చిట్టెం అవినాష్ సత్కరించి.. అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, నాయకులు కంచర్ల ప్రకాశరావు, ఉయ్యూరు శివ,బడే కోమలి పవన్ సాముల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో..

రాకెట్ సైన్స్‌పై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు: అంకిరెడ్డిపాలెంలోని జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో రాకెట్ సైన్స్ నిష్ణాతులు, విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త యల్లా శివ ప్రసాద్ విద్యార్థులతో రాకెట్స్ సైన్స్ గురించి మాట్లాడారు. రాకెట్ విజ్ఞానంపై విక్రమ్ సారాభాయి ఆసక్తి, కృషి, ప్రయోగ దక్షత గురించి, ప్రస్తుతం స్పేస్ మూజియంగా ఉన్న తిరువనంతపురంలోని చర్చి, మిస్సైల్ పితామహుడు అబ్దుల్ కలాం గురించి, ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాల గురించి, తదితర అంశాలను వివరించారు. అలాగే అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో అభివృద్ధి చెందిన దశలు, ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించి, ప్రపంచాన్ని నివ్వెర పరిచిన అంశాలు వివరించి విద్యార్థులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సి.జె.మణికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్

అంతరిక్ష విజ్ఞానం పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తుళ్లూరు

చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాకెట్ సైన్స్ అంశంపై స్థానిక మేరీమాత హైస్కూల్లో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యల్ల శివప్రసాద్ ప్రసంగిస్తూ రాకెట్ నిర్మాణం వాటిని అంతరిక్షంలో ప్రవేశపెట్టే విధానాన్ని విద్యార్థులకు వివరించి, భవిష్యత్తు అంతరిక్ష పరిశోధనలైన గగనయాన్, ఆదిత్య ఎల్ 1 ప్రాముఖ్యత గురించి వివరించారు. నేటి విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అంతరిక్ష విజ్ఞానంపై వివిధ పాఠశాలలలో విద్యార్థులకు అవగాహన కల్పించేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులైన జి శాంతమూర్తిని అభినందించారు. ముందుగా భారత తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేరీమాత సీబీఎస్ఈ పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ ఆల్ఫాన్సా, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జానెట్, సైన్స్ సీనియర్ ఉపాధ్యాయులు గల్లా శంకర్రావు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు సిపిఎస్ ఉపాధ్యాయుల సదస్సు : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల భద్రతకు ముప్పుగా పరిణమించిన సిపిఎస్ రద్దు చేయాలని 13వ తేదీన జరిగే సిపిఎస్ ఉపాధ్యాయుల సదస్సును జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ కోరారు. శుక్రవారం బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ని యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ దేశంలో అనేక రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేశారని, కానీ రద్దు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన ఏపీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గత మూడేళ్లుగా మోసపూరితమైన కథలు చెబుతుందన్నారు. సిపిఎస్ రద్దుకు చేపట్టిన కార్యాచరణలో భాగంగా జరుగుతున్న ఈ సదస్సులో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు షేక్.సాబ్జి ప్రధాన వక్తగా హాజరవుతారని, కావున ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.వెంకటేశ్వర్లు, సిహెచ్.ఆదినారాయణ, ఎండి.షకీలాబేగం, కె.రంగారావు, గురుబ్రహ్మం, కె.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో పలు చోట్ల శనివారం విద్యుత్ ఉపకేంద్రాల మరమ్మత్తుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.కావున వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

- వాసవి నగర్ 11కెవి ఫీడర్ మరమ్మతు కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ వాసవి నగర్, మంగళగిరి రోడ్డు, ఇజ్రాయిల్ పేట, నవభారత్ నగర్, ఎన్‌టిఆర్ నగర్‌లో అంతరాయం ఏర్పడుతుందని సబ్ డివిజనల్ ఆఫీసర్ పిహెచ్.ఖాన్ తెలిపారు.
- 33 కెవి లైన్ మెయింటినెన్స్‌లో భాగంగా రామిరెడ్డి తోట, రైలు పేట, రజకా బజార్, అహమద్ నగర్, పొత్తూరు వారితోట, బుడంపాడు, ఆనందపేట, సంగడిగుంట, పొన్నూరు రోడ్డు, ఎల్‌ఆర్ కాలనీ, ఐపిడి కాలనీలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ కరెంటు నిలిపివేయటం జరుగుతుందని టౌన్ 1 డిఇఇ ముస్తాక్ అహమద్ తెలిపారు.
- ఆటోనగర్ ఉప కేంద్రం పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆటో నగర్-1, 2 ఫీడర్లు, బొంగరాలబీడు, వసంతరాయపురం డొంకరోడ్డు, కాకుమానువారితోటలోని వినియోగారులకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ యం.రవికుమార్ తెలిపారు.


పల్నాడు, గుంటూరు జిల్లాలో ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి, కమిషనర్, మేయర్, ఎంపి, మంత్రి విడదల, అంబటి, హెనీ క్రిస్టీనా

సిఎంకు ఘనస్వాగతం

రోడ్డుకు ఇరువైపులా బారులుదీరిన మహిళలు, విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ యడ్లపాడు మండలం వంకాయలపాడు, గుంటూరులో శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. రోడ్డుకు ఇరువైపులా బారికెడ్లు నిర్మించగా వాటి వెనుక ప్రజలు సిఎంను చూసేందుకు అవకాశం కల్పించారు. బారికెడ్లు దాటి ముందుకురాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గుంటూరు పోలీసు పేరేడ్ గ్రౌండ్స్ నుంచి శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు ఆయన వెళ్తున్న సందర్భంలో సిఎంను చూసేందుకు మహిళలు, విద్యార్థులు, వైసిపి కార్యకర్తలు బారులు తీరారు. సిఎంకు చేతులు ఊపుతూ తమ ఉత్సాహాన్ని కనబర్చారు.సిఎం కూడా వారికి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. గుంటూరులో హెలిప్యాడ్ దిగగానే రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు సిఎంకు ఘన స్వాగతంపలికారు. గుంటూరులో స్వాగతం పలికిన వారిలో మంత్రులు ఆంజాద్ భాష, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎల్.అప్పిరెడ్డి, కె.ఎస్.లక్ష్మణరావు, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మురుగుడు హనుమంతరావు, కల్పలత, ఎమ్మెల్యేలు మద్దాలి గిరి, ఉండవల్లి శ్రీదేవి, మేకతోటి సుచరిత, మహమ్మద్ ముస్తఫా, అన్నాబత్తుని శివకుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, మేయరు కావటి శివనాగమనోహర నాయుడు, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, నగర కమిషనర్ చెకూరి కీర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, డిసిసిబి చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మీ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, శాసనసభ్యులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.


పల్నాడు జిల్లాలో మాట్లాడుతున్న సిఎం


పోలీస్ పెరేడ్ గ్రౌండ్ రోడ్డులో బారులు తీరిన ప్రజలు

వంకాయలపాడులో...

పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడులో సిఎం జగన్‌కు మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజనీ, జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్‌పి రవిశంకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎంపి లావు కృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, పోతుల సునీత, ఎమ్మెల్యేలు నంబూరు శంకరరావు, కాసు మహేష్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, కిలారి రోశయ్య, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఐటిసి చైర్మన్ సంజయ్‌పురి, స్పైసెస్ బోర్డు చైర్మన్ సతీయన్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.





వంకాయలపాడులో ఐటిసి ఉత్పత్తులు పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

ముస్లిమ్ విద్యారంగ ప్రముఖులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో శుక్రవారం జరిగిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల నేపథ్యంలో ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ విద్య దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా పలువురు మైనార్టీ ప్రముఖులను సిఎం జగన్ సన్మానించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ నేషనల్ అవార్డు ను ప్రొఫెసర్ కె.ముజఫర్ ఆలీకి రూ.1.25 లక్షల చెక్కును, డాక్టర్ అబ్దుల్ హక్ అవార్డును సయ్యద్ ఆరీఫుల్లా భాషా ఖాద్రికి రూ. లక్ష, వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు పొందిన అప్సర్ డెక్కాని, షేక్ మహ్మద్ హసీం, డాక్టర్ డి.మహ్మద్ సిద్దిక్, డాక్టర్ పి.దావూద్ ఖాన్, డాక్టర్ సయ్యద్ ఆంజాద్ ఆలీ, డాక్టర్ సయ్యద్ మస్తాన్ వలి, డాక్టర్ అబ్దుల్ గఫార్‌లకు ఒక్కొక్కరికిరూ.25వేలు చొప్పున చెక్కులు, మెమెంటో, ప్రశాంసాపత్రంలో శాలువ కప్పి సన్మానించారు.


ఐటిసి నమూనాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి








